మత్తు.. బాల్యం చిత్తు

మండలంలోని అనేక ప్రాంతాల్లో గిరిజన బాలలు మత్తుకు బానిసలుగా మారుతున్నారు. లాభాపేక్షే ధ్యేయంగా కొందరు వ్యాపారులు ఇంకును చెరిపే వైట్‌నర్‌ను బాలలకు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. దీనిని పీల్చుతూ గిరిజన బాలలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ దుస్థితి మండలంలోని నార్తురాజుపాళెంలో నెలకొంది.

- విచ్చలవిడిగా బాలలకు వైట్‌నర్ విక్రయం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- అనారోగ్యం పాలవుతున్న బాలలు



నార్తురాజుపాళెం సెంటర్‌లో బాహాటంగానే వైట్‌నర్ పీలుస్తున్న బాలుడు

కొడవలూరు : నార్తురాజుపాళెంలో 300లకు పైగా గిరిజన కుటుంబాలు ఉన్నాయి. తూర్పు కాలువ కట్ట, రైల్వే ట్రాక్ పక్కన, రైల్వే గేటు పక్కన గుడిసెలు వేసుకుని వీరంతా జీవనం సాగిస్తున్నారు. ఈ గిరిజన కుటుంబాల్లో 10 నుంచి 15 ఏళ్లలోపు బాలలు వంద మందికి పైగా ఉన్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ పిల్లల్లో అధిక శాతం మంది వైట్‌నర్ మత్తుకు బానిసలుగా మారుతున్నారు. ఐదేళ్ల క్రితం కొందరు చిన్నారులు రహస్యంగా వైట్‌నర్‌ను పీల్చేవారు. ప్రస్తుతం ఒకరికొకరు అలవాటుగా మార్చుకొని బహిరంగ ప్రదేశాల్లో పీల్చుతున్నారు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్తూ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. దీంతో బాలలు దుకాణాల్లో తక్కువ ధరకే లభ్యమయ్యే వైట్‌నర్‌ను కొనుగోలు చేసి పీల్చుతూ మత్తుకు బానిసలుగా మారుతున్నారు.

లాభాపేక్షే లక్ష్యంగా విక్రయాలు

బాలలకు వైట్‌నర్‌ను విక్రయించరాదన్న నిబంధన ఉంది. కానీ నార్తురాజుపాళెంలోని కొందరు వ్యాపారులు లాభా పేక్షే ధ్యేయంగా బాలలకు విక్రయిస్తున్నారు. పెన్నుతో రాసే వాటిని చెరిపేందుకు వినియోగించే వైట్‌నర్ చిన్నారులకు అవసరం లేదు. ఈ విషయం వ్యాపారులకు తెలిసినా కాసులకు కక్కుర్తి పడి విక్రయించేస్తున్నారు. దీంతో గిరిజన బాలలు అనారోగ్యం పాలవుతున్నారు. స్థానిక దుకాణాల్లో వైట్‌నర్‌ను విక్రయించకుంటే మరో ప్రాంతానికి వెళ్లి గిరిజన బాలలు కొనుగోలు చేయరు. వ్యాపారులు బాలలకు అమ్మకాలను నిలిపివేయడం ద్వారా గిరిజన బాలలను మత్తు బారి నుంచి కాపాడవచ్చు. కానీ ఆ దిశగా మానవతా కోణంలో వ్యాపారులు ఆలోచించడం లేదు. లాభమే లక్ష్యంగా వ్యాపారం సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి వ్యాపారులు వైట్‌నర్ విక్రయించకుండా చర్యలు తీసుకుని గిరిజన బాలలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విశ్వనాథునికి అభిషేక పూజలు


ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దంతాల సంరక్షణతోనే ఆరోగ్యం


దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ భవాని

మనుబోలు : దంతాలను సంరక్షించుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని దంత వైద్యురాలు భవాని అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నెల్లూరు స్మైల్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె పలువురికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో హాస్పిటల్ పీఆర్వో అబ్దుల్, భాను తదితరులు పాల్గొన్నారు.

పశువుల సమగ్ర సమాచారం ఇవ్వండి

నెల్లూరు(దర్గామిట్ట) : పశువులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని మీ ఇళ్లకు వచ్చే విషయ సేకరణదారులకు అందించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ పశు పెంపకందారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పశుసంవర్థకశాఖ రూపొందించిన 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. పశుగణన కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పశు సమాచారం పూర్తిగా అందించడం ద్వారా అనేక పథకాల రూపకల్పనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పశు సంవర్థకశాఖ జేడీ కోటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఫిట్స్

- వ్యక్తి మృతి


సుభాని మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : మద్యం మత్తులో ఫిట్స్ రావడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం జనార్ధనరెడ్డికాలనీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. జనార్ధనరెడ్డికాలనీకి చెందిన సుభాని(31), సాబ్‌జాని దంపతులు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. వెంకటేశ్వరపురంలోని టీ దుకాణంలో సుభాని టీ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా ఆయన ఫిట్స్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తనకు తెలిసిన వారి ఇంట్లో ఫంక్షన్ ఉందని విధులకు సెలవు పెట్టారు. అప్పటి నుంచి మద్యం సేవించసాగాడు. సోమవారం పూటుగా మద్యం సేవించి ఇంటికి వెళ్తుండగా జనార్ధనరెడ్డికాలనీ కల్వర్ట్ వద్దకు వచ్చేసరికి ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మృతుని భార్య, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతుని భార్య సాబ్‌జాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తెలిపారు.

జిల్లాలో ఘనంగా హర్ ఘర్ తిరంగా

నెల్లూరు(దర్గామిట్ట): ఆగస్టు 15ను పురస్కరించుకుని జిల్లాలో హర్ ఘర్ తిరంగా పేరుతో రోజూ ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందేలా ర్యాలీలు, విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, మానవహారాలు, స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాలు తెలిపే ఫొటో ఎగ్జిబిషన్లను నిర్వహించామన్నారు. ఆగస్టు 15 కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని కట్టుబడిపాళెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు సోమవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే సమకాలిన అంశాలపై అవగాహన కల్పించేందుకు క్విజ్ దోహదం చేస్తుందన్నారు. జ్ఞాపకశక్తి, పోటీ పరీక్షలపై ఆసక్తి పెంచేందుకు అప్పుడప్పుడు క్విజ్ పోటీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఈశ్వర విజయలక్ష్మి, హెచ్ఎం ప్రసాద్‌రావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ శాస్త్ర పితామహుడు రంగనాథన్


డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

కొడవలూరు : భారతదేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ అని గ్రంథాలయాధికారి కె.రాజేశ్వరి కొనియాడారు. డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ జయంతి సందర్భంగా కొడవలూరు గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ రంగనాథన్ మద్రాసు విశ్వవిద్యాలయ ప్రథమ గ్రంథ పాలకుడిగా, రచయితగా, ఆచార్యులుగా ప్రపంచ కీర్తిని గడించినట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పౌర గ్రంథాలయ చట్టాల రూపకల్పనలో, గ్రంథాలయ శిక్షణా తరగతుల్లో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం కె.వెంకయ్య, ఏఎన్ఎం సుభాషిణి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలకు వినతి


వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీకి వినతి పత్రం అందజేస్తున్న నారాయణగౌడ్

వెంకటాచలం : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ కోరారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావును నారాయణగౌడ్ సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు బీఈడీ కళాశాలల యాజమాన్యాలు ఎన్‌సీటీఈ, విశ్వవిద్యాలయాల నిబంధనలను ఉల్లంఘించి ఒరిస్సాకు చెందిన విద్యార్థులను జాయిన్ చేసుకుంటున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విద్యార్థులు తరగతి గదులకు, బ్లాక్ టీచింగ్‌కు హాజరుకాకున్నా పట్టించుకోవడం లేదని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి


యాంటీ ర్యాగింగ్ దినోత్సవంలో ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, విద్యార్థులు

వెంకటాచలం: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో యాంటీ ర్యాగింగ్ దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడడం చట్ట వ్యతిరేక చర్య అని తెలిపారు. వీఎస్‌యూలో ర్యాగింగ్ నియంత్రణకు యాంటీ ర్యాగింగ్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ నిరంతరం పనిచేస్తాయని చెప్పారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లతో సఖ్యతగా మెలగాలని సూచించారు. ర్యాగింగ్ నివారణలో పాల్గొనడం ప్రతి విద్యార్థి బాధ్యతగా భావించాలని తెలియజేశారు. విద్యార్థులు వీఎస్‌యూలో సీటు పొందడం ఒక అదృష్టంగా భావించి, ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్. విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి


పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎల్ఎన్నార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆమె సోమవారం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తోందన్నారు. కార్పొరేట్ స్థాయికి దీటుగా కళాశాలల్లో వసతులు కల్పించామని తెలిపారు. కళాశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, టీడీపీ నాయకుడు బత్తల హరికృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతులు

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులు తహసీల్దార్ ఎం.సారంగపాణికి సోమవారం వినతిపత్రాలను అందజేశారు. భూముల కొలతలు, భూ వివాదాలు, పాసు పుస్తకాలు తదితర సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సంబంధిత వీఆర్వోలతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సూరా నుంచి కాపాడండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: టీడీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డి నుంచి తమను కాపాడాలని పంచేడు గ్రామం ఎస్ఎస్సార్ కాలనీకి చెందిన గిరిజనులు అదే గ్రామానికి చెందిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత సురేంధర్‌రెడ్డికి విన్నవించారు. గ్రామంలోని సురేంధర్ రెడ్డి ఇంటికి సోమవారం వెళ్లి బాధితుల్లో ఒకరైన శ్రీనివాసులు అనే వ్యక్తి మాట్లాడారు. సూరా ఆగడాలపై ప్రశ్నించినందుకు తన తండ్రి నాగయ్యపై వారం రోజులక్రితం దాడి చేయించాడని, కేసు పెట్టడానికి పోలీసు స్టేషన్‌కు వెళ్తే ఫిర్యాదు తీసుకోలేదని తెలిపాడు. దీంతో నా తండ్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించారని వాపోయాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి బాధితులపై చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని కోరారు.

ఆశ చూపి.. దోచేసి..

- వృద్ధురాలిపై దాడి, నగదు అపహరణ

నెల్లూరు(క్రైమ్) : తక్కువ ధరకు వస్తువులను ఇచ్చేస్తున్నట్లు ఓ వ్యక్తి ఆమెను నమ్మించాడు. డబ్బులు తీసుకొస్తే వస్తువులను ఇస్తానని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి ఆమెపై దాడి చేసి నగదును దోచుకెళ్లాడు. ఈ ఘటన సోమవారం నగరంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై సోమవారం బీవీ నగర్‌లోని ఓ బిరియాని సెంటర్ ఎదురు సందులోకి వచ్చారు. తాము అమెరికాకు వెళ్తున్నామని తన ఇంట్లోని డబుల్ కాట్ మంచం, టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషీన్ ఇలా గృహోపకరణాలను తక్కువ ధరకే ఇచ్చేస్తామని అక్కడున్న మహిళలతో నమ్మబలికాడు. అతని మాటలు గుడ్డిగా నమ్మిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు తనకు కొన్ని వస్తువులు కావాలని చెప్పడంతో రూ.10 వేలు తీసుకుని తన వెంట వస్తే ఇస్తానని చెప్పాడు. దీంతో ఆమె నగదు తీసుకుని అతని బైక్‌లో వెళ్లింది. నిందితుడు అయ్యప్పగుడి సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి వృద్ధురాలిపై దాడి చేసి నగదు దోచుకెళ్లాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి ఇంటికి చేరుకని జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులు, స్థానికులకు తెలియజేసి కన్నీటి పర్యంతమైంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

జేవీవీ వార్షిక మహాసభలు 16న

నెల్లూరు(అర్బన్) : జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) నెల్లూరు నగర 17వ వార్షిక మహాసభలు ఈనెల 16వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆ వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని హరనాథపురంలో ఉన్న డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం జరుగుతాయన్నారు. ఈ సభలో శాస్త్రీయ విజ్ఞానం, సైంటిఫిక్ టెంపర్ అనే అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఎస్‌టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు (టౌన్) : స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మాగుంట లేఅవుట్‌లోని వారి కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో సంఘ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, పూర్వరాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, జిల్లా కార్యదర్శులు నాగిరెడ్డి, ఖాజావలి, సురేంద్రబాబు పాల్గొన్నారు.

మైనింగ్‌కు అనుమతిస్తే ప్రజలకు ఇబ్బందులు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పొదలకూరు : మండల కేంద్రం పొదలకూరుకు సమీపంలో చిట్టేపల్లి తిప్ప సర్వేనంబర్ 707లో క్వార్ట్జ్ మైనింగ్‌కు అనుమతులు ఇస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనింగ్ లీజు కోసం ఈనెల 6వ తేదీన ఏకపక్షంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ మైనింగ్ నిర్వహిస్తే చుట్టుపక్కల గ్రామాలతో పాటు అతిసమీపంలో ఉన్న తోకంచి తెలుగుగంగ పునరావాస కేంద్రంలో నివసిస్తున్న ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. సుమారు 1,500 కుటుంబాలు ఈ ప్రాంతంలో నివసిస్తున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో కూలి పనులు చేసుకునే ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని వెంటనే జిల్లా కలెక్టర్ విచారణ చేసి మైనింగ్ లీజును రద్దు చేయించాల్సిందిగా డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- ఫ్యాక్టో ఆధ్వర్యంలో ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

మనుబోలు : ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మనుబోలు ఎంఈఓ కార్యాలయం ఎదుట ఫ్యాక్టో ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని సర్దుబాటు ప్రక్రియను తాము బహిష్కరిస్తున్నామన్నారు. జీఓ నంబర్ 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన 53 జీఓ ప్రకారం సర్దుబాటు చేయాలన్నారు. పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇది మండలం, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని కోరారు. 70 శాతం పైగా అంగవైకల్యం ఉన్న ఉపాధ్యాయులను పని సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో బోధన సాగాలన్నారు. పదో తరగతి పరీక్షలు తెలుగు మీడియంలో రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ లీవ్‌పై వెళ్లిన ఎంఈఓ స్థానంలో హెచ్ఎంను నియమించాలని కోరారు. అనంతరం ఖాళీగా ఉన్న ఎంఈఓ చైర్‌కు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాక్టో యూనియన్ నాయకులు అనిల్‌కుమార్, మహేంద్ర, మనోజ్‌కుమార్, రవీంద్ర, శ్రీనివాసులు, సుధాకర్, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం బీసీజీ వ్యాక్సినేషన్ లక్ష్యం


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

మనుబోలు : పెద్దలకు వేసే బీసీజీ వ్యాక్సినేషన్‌ను నూరుశాతం పూర్తి చేయడమే లక్ష్యమని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎస్కే ఖాదర్‌వలి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి బీసీజీ వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుబోలు మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు కేవలం 55 శాతం మాత్రమే బీసీజీ వ్యాక్సినేషన్ పూర్తయిందన్నారు. దీనిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ వారాంతంలోపు 85 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన వారందరూ వ్యాక్సిన్ వేయించుకునేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అవసరమైతే గ్రామ పెద్దల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీహెచ్ఓ రాజయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధే ధ్యేయం


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

మనుబోలు : పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా పాటుపడుదామని ఎంపీపీ గుండాల వజ్రమ్మ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, వీధి లైట్లు తదితర అభివృద్ధి పనులపై సర్పంచ్‌లు, కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఒక్కో పంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తోందన్నారు. ఈ మేరకు ఆయా పంచాయతీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు దేశభక్తిపై వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిశీలకులు, డీపీఓ జి.రాజ్యలక్ష్మి పరిశీలించారు. కార్యక్రమంలో టీఓటీలు అనిత, చెంచుప్రసాద్, దీపిక, సుదర్శని తదితరులు పాల్గొన్నారు.

భారత సాంస్కృతిక వైభవంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వక్తలు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర విద్యా సంస్థల్లో 'భారత సాంస్కృతిక వైభవం' పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా జై భారత్ హాస్పిటల్ గిరిజన ఫ్రీ స్కూల్స్ ట్రైనర్ నంబూరు సుబ్బారావు పాల్గొని, మాట్లాడారు. నేటి తరం విద్యార్థుల్లో 'భారత సాంస్కృతిక వైభవం'పై అవగాహన అవసరమని తెలిపారు. భారతదేశంలోని వివిధ రంగాలకు సంబంధించిన శాస్త్రవేత్తలు, స్వాతంత్ర సమరయోధులు, రచయితలు, సంగీత విద్వాంసుల జీవిత విశేషాలు, వారి సేవల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఎస్ఎస్ఎస్ పీఓ రవికుమార్, జీవీఆర్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ దోర్నాదుల వెంకటేశ్వర్లు, జై భారత్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజర్ మనోహర్ పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

వెంకటాచలం : విద్య వల్ల కలిగే ప్రయోజనాల గురించి గిరిజనులు తెలుసుకుని తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి సూచించారు. మండలంలోని కురిచెర్లపాడు ఎస్టీకాలనీలో గిరిజన కుటుంబాలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వాణి మాట్లాడుతూ గిరిజనులు సమాజంలో తమకు ఉన్న హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. చదువు ద్వారా అన్ని విషయాలు తెలుసుకోగలరని చెప్పారు. తమ పిల్లలను ప్రాథమిక విద్యకే పరిమితం చేయకుండా ఉన్నత విద్య చదివించాలని తెలియజేశారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్బర్‌బాషా, కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు కీర్తిప్రియ, అనూరాధ, అర్షియ తదితరులు పాల్గొన్నారు.